సమాచారం

3, 4 తేదీల్లో మల్లారెడ్డి కళాశాలలో జాతీయ సదస్సు

మేడ్చల్: మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 3, 4వ తేదీల్లో జాతీయ సాంకేతిక సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సీఈఓ శ్రీనివాస్ జంధ్యాల తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలోని కళాశాలల విద్యార్థులు సదస్సులో పాల్గొంటారన్నారు. ఈ సదస్సులో టెక్నికల్, నాన్ టెక్నికల్, స్పోర్ట్స్ ఈవెంట్‌లు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నారపల్లిలో కంటి వెలుగు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు నారపల్లిలో బుధవారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని చైర్మన్ కొండల్‌రెడ్డి పర్యవేక్షించి మాట్లాడుతూ.. నారపల్లిలో రెండు రోజుల పాటు కొనసాగే కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సురేష్, కౌన్సిలర్ అబ్బవతిని సరిత, కంటి వైద్య నిపుణుడు శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వారాంతపు సంతలు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతీ వారం కూరగాయలు, ఇతర సామగ్రి విక్రయించే వారాంతపు సంతల సమాచారం ఇలా...

సోమవారం: రైల్వే స్టేషన్ రోడ్డు, అత్వెల్లి.
మంగళవారం: ఉమానగర్, కేఎల్ఆర్ విజయానగర్
బుధవారం: ఎస్‌జీఓస్ కాలనీ(మేడ్చల్).
గురువారం: వీకర్ సెక్షన్ కాలనీ.
శుక్రవారం: సూర్యనగర్, చంద్రానగర్.
శనివారం: హౌజింగ్‌బోర్డ్ కాలనీ, కిష్టాపూర్, చెక్‌పోస్టు, ఆర్టీసీ కాలనీ.
ఆదివారం: ప్రధాన మార్కెట్.

క్లుప్తంగా...

కేంద్రం పేదల నడ్డి విరుస్తోంది

- ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువులతో పాటు గ్యాస్ ధరలను పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తోందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు ఆరోపించారు. రూ.500 ఉన్న గ్యాస్ సిలిండర్ ఎనిమిదేళ్ల మోదీ ప్రభుత్వం పలుమార్లు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతుందన్నారు. నిన్నటి వరకు రూ.1130 ఉన్న గ్యాస్ ధర బుధవారం మరో రూ.50 పెంచడంతో రూ.1180కి ఎగబాకిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పేలా ప్రజలను చైతన్యవంతం చేసేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. పెంచిన గ్యాస్ ధరలను తగ్గించేంత వరకు బీఆర్ఎస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని ఎమ్మెల్సీ రాజు హెచ్చరించారు.

బీజేపీ ప్రభుత్వం సామాన్యుడికి ఉరితాడు బిగిస్తోంది

- మంత్రి చామకూర మల్లారెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలతో నిత్యావసరాల ధరలు పెంచుతూ సామాన్య ప్రజలకు ఉచ్చు బిగిస్తోందని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్ ధర పెంచడం దారుణమని, మహిళా దినోత్సవం సందర్భంగా గ్యాస్ ధరలు పెంచి మహిళలకు మోదీ ప్రభుత్వం కానుక ఇచ్చిందని ఆయన ఎద్దేవా చేశారు. కార్మిక, కర్షక, పేద, మధ్య తరగతి ప్రజలపై కక్ష గట్టిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని మంత్రి పిలుపునిచ్చారు.

నర్సింహా రెడ్డి కళాశాలలో రక్తదాన శిబిరం



మేడ్చల్: మైసమ్మగూడలోని నర్సింహా రెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎమ్ఎన్‌జే కేన్సర్ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు ఉన్నారు.

కనీస వేతన చట్టాన్ని సవరించకుండా కార్మికులకు తీవ్ర అన్యాయం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఐదేళ్లకోసారి సవరించాల్సిన కనీస వేతనాల చట్టాన్ని పదిహేనేళ్లైనా సవరించకుండా కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని, కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని సీఐటీయూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఎ.అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. అశోక్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఉన్ని కృష్ణ, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సంతోష్, చిన్న వీరయ్య, గణేష్ పాల్గొన్నారు.

ఉపాధి ఊపు తగ్గింది!

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నెమ్మదించిన ఉపాధి హామీ పనులు

- అర్బన్ జిల్లా సెమీ అర్బన్‌గా అభివృద్ధి చెందటమే కారణం
- 2023–24లో ఈజీఎస్ కింద రూ.2.5 కోట్లతో నిర్దేశించిన పనులపై దృష్టి
- ఉపాధి పథకంలో ప్రస్తుతం నిత్యం 370 మంది కూలీలకు పనులు



ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు చేస్తున్న కూలీలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉపాధి హామీ పనులు లక్ష్యం దిశగా కొనసాగేలా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) చర్యలు తీసుకుంటోంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 1.75 లక్షల పని దినాలను కల్పించడం ద్వారా రూ.2.5 కోట్లు లబ్ధి చేకూర్చేలా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు కార్యాచరణను డీఆర్డీఏ ఖరారు చేసింది. అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతంగా ఉన్న జిల్లాలో కరోనా కష్ట కాలంలో కూలీలకు ఎంతగానో చేయూత నిచ్చిన ఉపాధి హామీ పథకం ప్రస్తుతం నీరుగారుతోంది. జిల్లాలో 61 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతుండగా.. నిత్యం 360 నుంచి 370 మంది కూలీలు ఉపాధి పనులు చేపడుతున్నారు. గతంలో ఉపాధి హామీ పనుల్లో ఒక్కరికి రోజు కూలీ రూ.239 చెల్లించగా, ప్రస్తుతం రూ.249 ఖరారు చేశారు.

నెమ్మదిగా ఉపాధి పనులు...

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నగర శివారుల్లో నెమ్మదించింది. పనులు జోరందుకునే సమయంలోనే కూలీల హాజరు అంతంత మాత్రంగానే ఉంటోంది. మరో నెల రోజులైతే ఈ ఆర్థిక సంవత్సరం ముగుస్తోంది. కరోనా కాలంలో జరిగిన ప్రగతి కంటే ఈసారి తక్కువగా నమోదు కావడం గమనార్హం. కూలీల హాజరు, పనుల గుర్తింపు, నిధుల కేటాయింపు తదితర మార్పులు.. పనిపై ప్రభావం చూపుతున్నాయి. గతంతో పోల్చితే అవినీతి తగ్గినప్పటికీ ప్రగతి కనిపించడం లేదు.

రెండు పూటలా హాజరు...

ఇది వరకు రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోని సాఫ్ట్‌వేర్ సాయంతో పనులు జరిగేవి. ఆ ప్రకారం బిల్లులు చెల్లించే వారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్రం అమల్లోకి తెచ్చిన కొత్త సాఫ్ట్‌వేర్‌తో ఈజీఎస్ నడవనుంది. పాత పనుల్లో కొన్ని రద్దయ్యాయి. ముఖ్యంగా కూలీల హాజరు రెండు పూటలా చేశారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్(ఎన్ఎంఎంఎస్) సాయంతో ఉదయం, సాయంత్రం పని ప్రదేశం నుంచే ఆన్‌లైన్ చిత్రంతో హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. సిబ్బంది, అధికారులూ ఇదే సూత్రం పాటించాల్సి ఉంటోంది.

పారదర్శకత పాత మాటే..!

ఈజీఎస్ సంస్కరణలు వచ్చినప్పటికీ పనుల్లో పారదర్శకత లోపించిందనే విమర్శలు ఉన్నాయి. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా రెండు పూటలా హాజరు వేయాలనే నిబంధన ఉన్నా.. సిబ్బంది పెద్దగా పట్టించుకోవడం లేదు. సిబ్బంది పని వేళలను జియో ట్యాగ్ చేయాలని ఆదేశించారు.

గతేడాదిలో పూర్తయిన పనులివే...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 5 మండలాల పరిధిలో ఉపాధి హామీ పథకంలో 3093 కుటుంబాలకు సంబంధించి 19,350 జాబ్ కార్డులు ఉండగా.. 3,185 మంది సభ్యులకు ఈజీఎస్ కింద 1,38,755 పని రోజుల్లో వివిధ పనులు కల్పించడం ద్వారా రూ.3.37 కోట్ల లబ్ధి చేకూర్చారు. ఈజీఎస్‌లో ఇంకుడు గుంతలు, రైతు కల్లాలు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, హరితహారం వంటి పనులను కూలీలకు కల్పించారు. కాగా జిల్లాలో ఈజీఎస్ కింద 5 మండలాల్లో 921 ఇంకుడు గుంతలకు గానూ 569 పూర్తి కాగా, మిగతా వాటి పనులు పురోగతిలో ఉన్నాయి. 585 రైతు కల్లాల నిర్మాణ పనులకు గానూ 227 పూర్తి చేశారు. పల్లె ప్రకృతి వనాలకు సంబంధించి 81 పూర్తి కాగా, వైకుంఠధామాలు కూడా 61 పూర్తి చేశారు. 61 గ్రామ పంచాయతీల పరిధిలో 61 నర్సరీలు ఏర్పాటు చేయటంతో పాటు ఉపాధి హామీ పథకంలో గుంతలు తీయడం ద్వారా 3,62,854 మొక్కలు నాటారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి





సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, పాల్గొన్న అధికారులు, సిబ్బంది

- 14 కేంద్రాల్లో పోలింగ్‌కు ఏర్పాట్లు
- సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ నర్సింహా రెడ్డి

సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉపాధ్యాయ శాసన మండలి (ఎమ్మెల్సీ) ఎన్నికలను ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా అధికారులంతా సమన్వయంతో పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సెక్టోరియల్, నోడల్, జిల్లా స్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 13 జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 14 పోలింగ్ కేంద్రాలకు గాను 8 పోలింగ్ కేంద్రాలను కీసరలో, 6 పోలింగ్ కేంద్రాలను మల్కాజిగిరిలో ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో 6,536 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా ఉన్నారని, వారు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను బ్యాలెట్ పేపర్ల ద్వారా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నిర్ణయించినందున.. అందుకు అవసరమైన బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మంచినీటి వసతి, వెబ్‌కాస్టింగ్, విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. మూత్రశాలలు, ఇతర మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర సామగ్రితో వెళ్లాల్సి ఉంటుందని, వారికి ప్రత్యేకంగా పోలీసు బందోబస్తుతో కూడిన బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన పోలీసు బందోబస్తు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, ఎన్నికల అధికారులు పాపిరెడ్డి, రంగాచారి, సెక్టోరియల్, నోడల్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రీతి మృతి'

సాక్షి,మేడ్చల్ జిల్లా: కాలేజీ యాజమాన్యంతో పాటు ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే వరంగల్ పీజీ మెడికల్ విద్యార్థిని ప్రీతి మృతి చెందిందని ఐసీఈయూ హైదరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య, ఉమెన్ కన్వీనర్ మైథిలి ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. కాలేజీల్లో ర్యాగింగ్ వంటి చర్యలపై సరైన నియంత్రణ లేదని, కాగితాలకే పరిమితమైందన్న విషయాన్ని ప్రీతి ఉదంతం తెలుపుతుందన్నారు. చట్టాలు పటిష్ఠంగా ఉన్నా.. అమలులో చిత్త శుద్ధి లేకపోవడం వంటి కారణాలు ప్రీతి ఘటనలో స్పష్టమవుతున్నాయని అన్నారు. దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించడంతో పాటు ఇలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గ్యాస్ ధరలను తగ్గించాలి

కీసర: పెంచిన గ్యాస్ ధరలను కేంద్రం ప్రభుత్వం వెంటనే తగ్గించాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ పరిధిలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని, కొంత మంది ధనికులకు మేలు చేసేందుకే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. ఇప్పటి వరకు పలుమార్లు గ్యాస్ ధరను పెంచిన బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, తేళ్ల శ్రీధర్, నిమ్మల శ్రీనివాస్, దయాకర్‌రావు, అన్నంరాజు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పరీక్షలు: 30 రోజుల్లో 2.32 లక్షలు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కొనసాగుతున్న 'కంటి వెలుగు' కార్యక్రమం

- 2.32 లక్షల మందికి పూర్తయిన కంటి పరీక్షలు
- 73,189 మందికి రీడింగ్ గ్లాసుల అందజేత
- లక్ష్యాన్ని చేరేందుకు మరింత పకడ్బందీగా శిబిరాల నిర్వహణ







శిబిరాల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పర్యవేక్షిస్తున్న జిల్లా వైద్యాధికారులు తదితరులు


సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సందడిగా కొనసాగుతోంది. దాదాపు నెల రోజులుగా సాగుతున్న ఈ శిబిరాల్లో గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎంతో మంది కంటి పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 79 బృందాలను నియమించి సేవలందిస్తున్నారు. ఒక్కో బృందంలో వైద్యుడు, నేత్ర వైద్య సహాయకుడు, ఆపరేటర్‌తో సహా ఏడుగురు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. సెలవు దినాలు మినహా వారానికి ఐదు రోజుల చొప్పున వంద రోజుల పాటు వైద్య పరీక్షలు కొనసాగేలా కార్యాచరణను ఖరారు చేసి ముందుకు సాగుతున్నారు. గ్రామాలు, పట్టాణాలు, పురపాలక సంఘాల్లో వార్డులు, డివిజన్ యూనిట్‌గా తీసుకుంటూ.. ఒక్కో కంటి వెలుగు కేంద్రంలో ప్రతి రోజు 120–140 మందికి కంటి పరీక్షల చొప్పున 79 కేంద్రాల్లో దాదాపు 7,500 మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ డిప్యూటీ డేమో, మీడియా అధికారి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

2.32 లక్షల మందికి పూర్తి..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఇప్పటి వరకు 22 గ్రామ పంచాయతీలు, 105 డివిజన్లు/వార్డుల్లో 2,32,392 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరాల్లో లబ్ధిదారులకు ఆధునిక పరికరాలతో పరీక్షలు చేసి దృష్టి లోపాలను గుర్తిస్తున్నారు. అనంతరం తప్పని సరైన వారికి 73,189 మందికి అక్కడే రీడింగ్ గ్లాసులు అందజేశారు. ప్రిస్కిప్షన్ కంటి అద్దాలు అవసరమైన వారి వివరాలను నమోదు చేసుకుంటూ తయారీ కోసం ఇండెంట్ పెడుతున్నారు. దాదాపు 31.49 శాతం మందికి రీడింగ్ గ్లాసులు అందజేశారు. అలాగే 14.10 శాతం మందికి కంటి చికిత్సలు అవసరమని గుర్తించిన వైద్యులు నిర్దేశించిన సంబంధిత ఆస్పత్రులకు సిఫార్సు చేస్తున్నారు. అక్కడ కంటి విభాగంలోని వైద్య నిపుణులు పరీక్షించి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని గుర్తిస్తున్నారు.

18 ఏళ్ల పైబడిన వారందరికీ చికిత్స

18 ఏళ్ల పైబడిన వారందరికీ చికిత్స ప్రభుత్వం 18 ఏళ్ల పైబడిన వారందరికీ కంటి పరీక్షలు చేయాలని సూచించింది. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకుని, అవసరమైన వారు కళ్లజోళ్లు తప్పనిసరిగా తీసుకోవాలి. చికిత్సలు, శస్త్రచికిత్సలు అవసరమైన వారిని సంబంధిత ఆస్పత్రులకు పంపిస్తున్నాం. వైద్య నిపుణుల సలహా మేరకు వారికి అవసరమైన చికిత్సలు చేయిస్తాం.



– డా.పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

జిల్లాలో 27.51 లక్షల లక్ష్యం...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో రెండో విడత కంటి వెలుగులో 27,51,810 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జీహెచ్ఎంసీలోని 40 డివిజన్ల పరిధిలో 20,92,711 మందికి కంటి పరీక్షలు చేపట్టాలని నిర్ణయించగా.. ఇందుకు గానూ 43 బృందాలను నియమించారు. అలాగే, బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట నగర పాలక సంస్థలు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, దుండిగల్, కొంపెల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల పరిధిలో మొత్తంగా 289 డివిజన్లు/వార్డుల్లో 5,36,567 మందికి కంటి పరీక్షలు నిర్వహించేందుకు 22 బృందాలు నిమగ్నమై పని చేస్తున్నారు. 61 గ్రామ పంచాయతీల్లో 1,22,532 మందికి 10 బృందాలు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

రహదారి విస్తరణకు రూ.209 కోట్లు మంజూరు

రాంపల్లి చౌరస్తా నుంచి యంనంపేట వరకు పనులు



సర్వే పనులు పరిశీలిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ రాంపల్లి చౌరస్తా నుంచి యంనంపేట వరకు.. అదేవిధంగా చర్లపల్లి నుంచి ఔటర్‌రింగ్‌రోడ్డు వరకు ప్రస్తుతం ఉన్న ఆర్అండ్‌బీ రహదారిని విస్తరించేందుకు ప్రభుత్వం నుంచి రూ.209 కోట్ల మేర నిధులు మంజూరయ్యాయని చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం రెండు చోట్ల రహదారి విస్తరణ పనులు చేపట్టేందుకు ఏజెన్సీ ఆధ్వర్యంలో రహదారుల సర్వే పనులు చేపట్టారు. ఈ పనులను కమిషనర్ వాణీరెడ్డితో కలిసి చైర్మన్ పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న రహదారి ఎన్ని ఫీట్ల మేర ఉందన్న విషయాన్ని ఏజెన్సీ సభ్యులు సర్వే చేపట్టారు. రోడ్డు విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న డబుల్ రహదారిని నాలుగు లైన్ల రహదారిగా మార్చడంతో పాటు రోడ్డు మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ తదితర పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, దీకొండ సుదర్శనం, రఘు తదితరులు పాల్గొన్నారు.

చెరువు శిఖం భూమి కబ్జాపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ సురేందర్ ముదిరాజ్

మేడ్చల్: మండలంలోని గౌడవెల్లి గ్రామ సుతారి చెరువు శిఖం భూమి కబ్జా చేస్తున్నారని గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ తహసీల్దార్ సరితకు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 346, 347లో గల సుతారి చెరువు శిఖం భూమిని గ్రామానికి చెందిన సింగిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నారని, కబ్జాదారులపై తగిన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ సరితను సర్పంచ్ కోరారు.

జవహర్‌నగర్ కార్పొరేషన్ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసినందుకు గాను బుధవారం మంత్రి చామకూర మల్లారెడ్డి సమక్షంలో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న కార్పొరేటర్ ఏకే మురుగేష్. చిత్రంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు ఉన్నారు. – జవహర్‌నగర్



చౌదరిగూడలో ఓజాస్ బాంకెట్ హాల్ ప్రారంభం



పూజలు చేస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్: చౌదరిగూడ ఓయూ కాలనీలో పీర్జాదిగూడ మేయర్ వెంకట్‌రెడ్డి, పోచారం మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, మేడ్చల్ మాజీ సుధీర్‌రెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ఓజాస్ బాంకెట్ హాలును బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి వారి మనసు దొరగొన్నప్పుడే వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, పిల్లా గోపాల్‌రెడ్డి, కొర్రెముల్ సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, ఉప సర్పంచ్ రాజుముదిరాజ్, చౌదరిగూడ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాములుగౌడ్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత



చెక్కు అందజేస్తున్న సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ గీత

ఘట్‌కేసర్: ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం ముఖ్యమంత్రి సహాయనిధి పథకమని కాచివానిసింగారం గ్రామ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఉప సర్పంచ్ గీత, అన్నారు. మహేశ్వరీనగర్‌కు చెందిన నరసింహ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో చికిత్స పొందగా సీఎంఆర్ఎఫ్ నుంచి ఆయనకు రూ.60 వేలు, అలాగే కొండాపూర్‌కు చెందిన సబితకు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు షౌకత్ రూ.57.500ల చెక్కులను గ్రామ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డితో కలిసి వారు అందజేశారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి

కీసర: అంధత్వ తెలంగాణ నిర్మూళనకు, పేద ప్రజలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాగారం చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని వికాస్‌నగర్‌కాలనీలో బుధవారం ఆయన కంటివెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కౌకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వికాస్‌నగర్‌లో కంటి వెలుగును ప్రారంభిస్తున్న చంద్రారెడ్డి

లిఫ్ట్ గుంతలో పడి యువకుడి అనుమానాస్పద మృతి



చంద్రకాంత్ సాయి (ఫైల్)



మృతదేహంతో ధర్నా చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు

ఘట్‌కేసర్: నిర్మాణంలో ఉన్న ఓ బహుల అంతస్తుల భవనం లిఫ్ట్ గుంతలో అనుమానాస్పద స్థితిలో యువకుడు మంగళవారం రాత్రి మృతి చెందాడు. సీఐ అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం.. యంనంపేట్‌కు చెందిన మీసాల చంద్రకాంత్ సాయి(23) మంగళవారం రాత్రి స్నేహితుడితో ఫోన్ మాట్లాడుతూ.. రైల్వే వంతెన సమీపంలోని ముకేశ్ అగర్వాల్ నిర్మిస్తున్న బహుల అంతస్తుల భవనం పైకి వెళ్లాడు. ఫోన్ మాట్లాడుతూ ప్రమాదవశత్తు చీకటిలో లిఫ్ట్ కోసం తీసిన గుంతలో పడిపోయాడు. పెద్ద శబ్దం రావడంతో సిబ్బంది భవన పరిసరాలు గాలించారు. చివరికి లిఫ్ట్ గుంతలో అనుమానాస్పద స్థితిలో యువకుడు పడి ఉండడం కనిపించడంతో పోలీసులు, స్థానికులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు స్థానికుల సాయంతో శవాన్ని బయటకు తీశారు. అనంతరం శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. నిర్మాణుష్య ప్రదేశంలోకి తమ కుమారుడిని తీసుకెళ్లి హత్య చేశారని ఆరోపిస్తూ నింధితులను కఠినంగా శిక్షించాలని ఈసీఐఎల్–ఘట్‌కేసర్ రోడ్డుపై శవంతో తల్లి తండ్రులు, బంధువులు ధర్నా చేశారు. సీఐ అశోక్‌రెడ్డి ధర్నా ప్రదేశానికి వెళ్లి న్యాయం చేస్తామని నచ్చచెప్పడంతో ధర్నాను విరమించారు. కుమారుడిని హత్యచేశారని ఆరోపిస్తూ మృతుడి తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. యువకుడి మృతికి గల కారణం ప్రేమ వ్యవహారమా? ఆర్థిక సమస్యలా? హత్యా? ఇతర సమస్యలేమైన ఉన్నాయా.. అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా సీసీ పుటేజ్‌లో చంద్రకాంత్ సాయి ఒక్కడే నడుచుకుంటూ వెళ్లినట్లు తేలిందని సీఐ పేర్కొన్నారు.

ఘనంగా గజ వాహన సేవ



ఆలయ ఆవరణలో అగ్ని గుండాలు

మేడ్చల్: మేడ్చల్ దాక్షాయని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారికి గజ వాహన సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని పల్లకిలో గజ వాహనాంపై పట్టణ వీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారుజామున అగ్ని గుండాల కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం రాత్రి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

నేటి నుంచి జాతర..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం దోపు సేవ నిర్వహించిన అనంతరం జాతర ప్రారంభమవుతుంది. వారం రోజుల పాటు జరిగే ఈ జాతరలో వేలాది మంది పాల్గొని స్వామి వారిని దర్శనం చేసుకుంటారు. జాతర సందర్భంగా ఆలయ రోడ్డులో వివిధ రకాల వస్తువులను విక్రయించే దుకాణాలు, రంగుల రట్నాలు, వివిధ గేమ్స్ స్టాల్స్‌లు వెలిశాయి.